
Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేల్చుదాం..

epaper.telanganaveena.com | సంపుటి :1 | సంచిక: 334 | హైదరాబాద్ | సోమవారం | 19 -08 - 2024 | పేజీలు: 8 | రూ.3/-






## 2026లోనే శాసనసభ స్థానాల పెంపు: స్పష్టం చేసిన కేంద్రం

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ, ఆగస్టు 18:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలలో శాసనసభ స్థానాల పెంపు 2026లోనే నని కేంద్రం స్పష్టం చేసింది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 (3) ప్రకారం 2026లో జనాభా లెక్కల అనంతరమే ఏపీలో 175 నుంచి 225 శాసనసభ స్థానాలుతెలంగాణలో 119 నుంచి 153 శాసనసభ స్థానాల పెంపునియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పుడే ఎస్సీ ఎస్టీ స్థానాల పునఃసర్దుబాటు ఆంధ్రప్రదేశ్ పునర్విభ జన చట్టం -2014ను న్యాయ మంత్రిత్వ శాఖ ద్వారా మార్చి1, 2014న గెజిట్ లో ప్రచురించినట్లు వివరించింది.లోక్ సభలో తెరాస ఎంపీ బాల్కసుమన్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి హరిభాయ్ చౌదరి ఈ మేరకు లిఖిత పూర్వకంగా సమాధానం తేలిపారు.

## పేద 'రాజు'లకు సీఎం రేవంత్ రెడ్డి

# గుడ్ న్యూస్



**తెలంగాణ వీణ/హైదరాబాద్, ఆగస్టు18:** రాష్ట్రంలో క్షత్రియ భవన్‌కు అవసరమైన స్థలాన్ని ఇస్తామని, నిర్మాణానికి అవసరమైన అనుమతులు కూడా ఇస్తామని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదే తీరుల ప్రభుత్వానికీ తగిన సహకారం అందించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీగా ఫోర్త్ సిటీని నిర్మిస్తున్నదని, అందులో వివిధ రంగాలకు చెందిన పరిశ్రమ ల్లో పెట్టుబడులు పెట్టి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. క్షత్రియ సేవా సమితి నిర్వహించిన సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ ప్రసంగిస్తూ... హైదరాబాద్ సిటీ అభివృద్ధిలో వేర్వేరు రూపాల్లో 'రాజు'ల కృషి, పట్టుదల, సహకారం ఉన్నదని, రానున్న ఫోర్త్ సిటీలో సైతం అదే కొనసాగాలని ఆకాంక్షించారు. క్షత్రియుల్లోనూ పేదలు ఉన్నారని, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తామని, అర్హులైనవారి వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. నిబద్ధత, కష్టపడేతత్వం, పట్టుదల ఉండే క్షత్రియుల సహకారాన్ని ప్రభుత్వం కోరుతున్నదన్నారు.చరిత్రలో క్షత్రియుల గొప్పదనానికి సంబంధించి అనేక ఉదాహరణలు ఉన్నాయని, ఉమ్మడి రాష్ట్రంలో 1960వ దశకంలో వ్యవసాయంలో కొత్త వంగడాలను పరిచయం చేశారని, అప్పట్లో గ్రామంగా ఉన్న కొంపల్లి ఇప్పుడు నగరంగా వృద్ధి చెందిందని గుర్తుచేశారు. ఐటీ రంగంలో సత్యం రామలింగరాజు మొదలు మీడియాలో కూడా అనేక మంది క్షత్రియుల పాత్ర ఉన్నదని, ఇక ఫార్మా, మెడికల్, ఇండస్ట్రీ, రియల్ ఎస్టేట్.. ఇలా అన్నింటా వారి స్థానం కనిపిస్తుందన్నారు. ఆయా రంగాలు వృద్ధి చెందడానికి పెట్టుబడులొక్కటే కారణం కాదని, దాని వెనక కృషి, పట్టుదల, శ్రమ, కమిట్‌మెంట్, ట్రస్ట్, కష్టపడేతత్వం లాంటివి కూడా ఉన్నాయని, అందులో రాజులు ఏ రంగంలో ప్రవేశించినా తప్పకుండా రాణిస్తారనే గుర్తింపు లభించిందన్నారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీలో సైతం తాను క్షత్రియుల నుంచి ఇదే కోరుకుంటున్నానని, వారు అన్ని విధాలా

వివరాలు 2లో



### నేడు తిరుపతిలో పర్యటించనున్న

## సీఎం చంద్రబాబు

**తెలంగాణ వీణ/అమరావతి:ఆగస్టు 18:** ఏపీ సీఎం చంద్రబాబు రేపు తిరుపతి శ్రీ సిటీలో పర్యటించనున్నారు. శ్రీ సిటీలోని పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. శ్రీ సిటీలో 15 సంస్థల కార్యకలాపాలు ప్రారంభిం చనున్నారు. మరో 7 సంస్థలకు శంకుస్థాపన చేయనున్నారు. ఆయా సంస్థల ద్వారా రూ.900 కోట్ల పెట్టుబడితో 2,740 మందికి ఉపాధి లభించనుంది. మరో 1,213 కోట్ల పెట్టుబడికి ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోనుంది.రేపటి పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు శ్రీ సిటీ బిజినెస్ సెంటర్ లో పలు కంపెనీల సీఈవోలతో సమావేశం కానున్నారు. కాగా, చంద్ర బాబు రేపు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనూ పర్యటించనున్నారు. ఇక్కడి సోమశిల ప్రాజెక్టును సందర్శించనున్నారు. సోమశిలలో వరదలకు దెబ్బతిన్న కట్ట పనులను పరిశీలించనున్నారు.

## కోల్‌కతా ఘటనపై నేడు సుప్రీంకోర్టులో విచారణ



**తెలంగాణ వీణ/కోల్‌కతా:ఆగస్టు 18:** కోల్ కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో నైట్ డ్యూటీలో ఉన్న ట్రెయినీ డాక్టర్ పై హత్యాచారం ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.కాగా, ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో సోమవారం నాడు విచారణ జరగనుంది. సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారణ జరపనుందని సుప్రీంకోర్టు వెబ్ సైట్ లో తెలిపారు. ఈ బెంచ్ లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తో పాటు, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా కూడా ఉన్నారు. కాగా, కోల్ కతా హత్యాచార ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించాలంటూ సీజేఐ డీవై చంద్రచూడ్ ను ఉద్దేశించి మోనికా సింగ్ అనే వైద్యురాలు ఓ లేఖలో విజ్ఞప్తి చేశారు. తక్షణమే నిష్పాక్షిక దర్యాప్తు జరిగేలా ఆదేశాలు జారీ చేయాలని ఆమె అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

## కాంగ్రెస్ పెద్దలకు

# కేటీఆర్ లేఖ..



**తెలంగాణ వీణ/హైదరాబాద్, ఆగస్టు18:**తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ అంశంలో రైతుల పట్ల నమ్మకద్రోహానికి పాల్పడిందంటూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు.ఈ మేరకు ఆయన కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు లేఖాస్త్రం సంధించారు. తెలంగాణలోని లక్షలాది మంది రైతుల తరఫున ఈ లేఖ రాస్తున్నానని, రుణ మాఫీ చేస్తామన్న హామీ విషయంలో కాంగ్రెస్ సర్కారు రైతులను తీవ్ర నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఘనంగా ప్రకటించారని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఉందని, అరకొర రుణమాఫీతో సరిపెడుతున్నారని విమర్శించారు. తెలంగాణలో లక్షల సంఖ్యలో రైతులు ఉండగా, వారిలో రుణమాఫీ అందనివారే ఎక్కువమంది ఉన్నారని కేటీఆర్ వెల్లడించారు. ఆ రైతులకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ, వారికి రుణమాఫీ నిరాకరించారని ఆరోపించారు.

# సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చు

**తెలంగాణ వీణ/హైదరాబాద్, ఆగస్టు18:**విద్యావ్యవస్థ పటిష్టంగా ఉంటే సమాజంలో బలమైన మార్పు సాధ్యమవు తుందని నొక్కిచెప్పిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. ఆ రంగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.గతంతో పోలిస్తే బడ్జెట్‌లో నిధుల కేటాయింపుతో పాటు విద్యారంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయడంపై స్వయంగా ముఖ్యమంత్రే ఫోకస్ పెట్టారని తెలిపారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని, ఇందుకోసం రూ.5 వేల కోట్లను కేటాయించనున్నట్లు తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమానికి చీఫ్ గెస్టుగా హాజరైన డిప్యూటీ సీఎం ప్రసంగిస్తూ.. ఇందిరమ్మ రాజ్యానికి ఆయన ఆలోచనే స్ఫూర్తి అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు రాష్ట్రంలో నెలకొన్న ప్రజా ప్రభుత్వానికి ఆయన జీవితమే స్ఫూర్తి అని కొనియాడారు.ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అంబేద్కర్ నాలెడ్జి సెంటర్లను నిర్మిస్తామని, అందులో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. గత ప్రభుత్వంలో సర్కారు స్కూళ్ళు మూతబడితే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాల లేని గ్రామ పంచాయతీ ఉండొద్దన్న ఉద్దేశంతో కొత్తవాటిని తెరిపిస్తున్నట్లు గుర్తుచేశారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున సర్వాయి పాపన్న విగ్రహం ఉండాలన్న విజ్ఞప్తులు వచ్చాయని, దానికి ప్రభుత్వం సానుకూలగా ఉన్నదన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయడంతో పాటు విగ్రహాన్ని ఎక్కడ పెట్టాలి, స్థలాన్ని ఎలా సేకరించాలి తదితర అంశాలపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. దానిపై స్పష్టమైన నివేదికను ప్రభుత్వానికి ఇవ్వ గానే కార్యరూపం దాల్చేలా తాను చొరవ తీసుకుంటానని అన్నారు. ఇందిరమ్మ రాజ్యానికి పాపన్న జీవితమే ఆదర్శమని గుర్తుచేసిన డిప్యూటీ సీఎం.. రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడం, ప్రజలు మెచ్చే పాలనను అందించడం, బడుగులకు అవకాశాలు ఇవ్వాలని ఆచరణ ద్వారా ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత సర్దార్ సర్వాయి పాపన్నకే దక్కుతుందన్నారు. ఆయన పుట్టిన ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి రూ.4.70 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. పాపన్న జీవిత చరిత్రపై రూపొందించిన పాకెట్ బుక్కును ప్రతి గ్రామానికి పంపాలని, విరివిగా ప్రజల వద్దకు తీసుకెళ్లాలని, ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని భరోసా ఇచ్చారు. ఒక కూలీగా జమిందార్ వద్దకు చేరి సహచరులందర్నీ యుద్ధానికి సిద్ధం చేశారని, ఈ సమాచారం లీక్ కావడంతో జమీందారు అందర్నీ బంధిస్తే ఇబ్బందులకు తలవంచకుండా స్నేహితులనే సైనికులుగా మార్చి జమీందారు కోటలను పాపన్న జయించారని గుర్తుచేశారు. వరంగల్ కోటనే కాక గోల్కొండ కోటనూ జయించారని, జమిందార్లతో పోరాటం ప్రాణానికే ప్రమాదమంటూ తల్లి వారించినా ప్రజల కోసం సిద్ధపడ్డారని తెలిపారు.హక్కులు, కోర్టులు, చట్టాలు లేని సమయంలోనే సర్వాయి పాపన్న ఎన్నో విజయాలు సాధించి స్ఫూర్తిగా నిలిచారని కీర్తించారు. సామాన్యులను కూడగట్టి సైనికులుగా తీర్చిదిద్దిన సర్దార్ పాపన్న... భారతదేశంలోనే బలమైన సైన్యం కలిగిన మొఘల్ చక్రవర్తులను ఓడించారని, సంకల్పబలం ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆచరణ ద్వారా నిరూపించారని గుర్తుచేశారు.



## హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం

**తెలంగాణ వీణ/హైదరాబాద్:ఆగస్టు 18:** ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో గత కొన్నిరోజులుగా తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాదు నగరాన్ని ఇవాళ కూడా వర్షం ముంచెత్తింది.నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తుండడంతో, పలు చోట్ల రోడ్లపైకి నీరు చేరింది. దాంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. వాహనదారులు అవస్తలు పడుతున్నారు. ఉప్పల్, హయత్ నగర్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, దిల్ సుఖ్ నగర్, తార్నాక, కోఠి, సోమాజిగూడ, నాంపల్లి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయం కావడంతో ఎల్బీనగర్-చాదర్ ఘాట్ మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



## అభిషేక్ మను సింఘ్వీ అభ్యర్థిత్వాన్ని ఆమోదించిన రాష్ట్ర కాంగ్రెస్

**తెలంగాణ వీణ/హైదరాబాద్, ఆగస్టు18:** గచ్చిబౌలిలోని షెర్టాన్ హెూటల్‌లో ఆదివారం సాయంత్రం సీఎల్పీ సమావేశం జరిగింది. తెలంగాణ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని ఆమోదించినందుకు అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలుపుతూ సీఎల్పీ తీర్మానం చేసింది.సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, అభిషేక్ మను సింఘ్వీ ఎమ్మెల్యేలు, సీనియర్‌నేతలు హాజరయ్యారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాసరెడ్డి, కాలే యాదయ్య తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సోమవారం ఉదయం 11 గంటలకు రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ దాఖలు చేయనున్నారు.



## పేద 'రాజు'లకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి)

సహకరి,చాలని పిలుపునిచ్చారు.హాలీవుడ్‌తో పోటీ పడగలిగిన బాహుబలి కూడా ఒక రాజేనని, తనకు మంచి మిత్రుడైన రాంగోపాల్ వర్మ కూడా బాలీవుడ్‌కు ఎదిగారని గుర్తుచేశారు. కృష్ణంరాజు గురించి మాట్లాడుకోకుండా సినీ రంగాన్ని చర్చించలేమని గుర్తుచేసిన సీఎం రేవంత్... సైద్ధాంతికంగా కొందరు రాజకీయ నాయకులతో విభేదాలున్నా వారు స్నేహితులేనని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం పునఃప్రారంభించాలనుకుంటున్న నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఇప్పుడు రాజుల చేతుల్లోనే ఉన్నదని, పన్నెండేళ్లుగా పరిష్కారం కానిది ఇప్పుడు కొలిక్కి వస్తున్నదని, వారి సహకారంతోనే తొందర్లో అది రీ-ఓపెన్ అవుతున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న యంగ్ ఇండియా తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీకి కో-చైర్మన్‌గా శ్రీనివాసరాజునే నియమించామని గుర్తుచేశారు.కాంగ్రెస్ పార్టీలో సైతం రాజులకు తగిన ప్రయారిటీ ఉన్నదని, అందువల్లనే టికెట్ రాకపోయినా కర్ణాటకలో పార్టీని అధికారంలోకి తెచ్చిన బోసురాజు కృషిని గుర్తించి రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా ఆయనకు మంత్రి పదవి ఇప్పించారని సీఎం రేవంత్ గుర్తుచేశారు. తెలంగాణలో పదేండ్ల పాటు పార్టీ కష్టకాలంలో ఉన్నా తన శక్తిని ధారపోసి ఇప్పుడు పవర్‌లోకి వచ్చేలా చేయడంలో బోసురాజు కృషి ఉన్నదన్నారు. రానున్న రోజుల్లో నాగరాజు లాంటి వ్యక్తికి కార్పొరేటర్ పదవి ఇచ్చి ఆ తర్వాతి దశలో ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగు పెట్టేందుకు తాను చొరవ తీసుకుంటానని అన్నారు. ఇంకా ఎవరైనా రాజులకు రాజకీయాల్లో అవకాశాలు కావాలంటే తన దృష్టికి తేవచ్చన్నారు. ఇప్పుడు మన ముందు కేంద్ర మంత్రిగా ఉన్న భూపతిరాజు శ్రీనివాసవర్మకు పార్టీలో లాయల్టీ ఉన్నదని, నిబద్ధత ఉన్నదని కానీ డబ్బులు మాత్రం లేవని, అయినా కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కిందని, పార్టీ వేరైనా వెంటనే ఫోన్ చేసి అభినందించానని గుర్తుచేశారు.రాజుల్లో పేదలు కూడా ఉన్నారని, వారి వివరాలను ప్రభుత్వానికి అందిస్తే సంక్షే పథకాలను వారికి కూడా వర్తింపజేసేలా తాను చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. నిర్మాణ రంగంలో రాజులకు ఉన్న అనుభవాన్ని రంగరించి క్షత్రియ భవన్‌ను అద్భుతమైన కట్టడంగా మల్చాలని, ఆ భవన్‌లోనే మరోసారి మనం కలుసుకుందామని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కి కీలక బాధ్యతలు



**తెలంగాణ వీణ/ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ నగరంలోని రవీంద్రభారతిలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న జీవితం అందరికీ ఆదర్శం అని అన్నారు. భవిష్యత్ తరాలకు పాపన్న స్ఫూర్తి గాథలు తెలియాలని అభిప్రాయపడ్డారు. సర్వాయి పాపన్న స్వగ్రామాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతామని కీలక వ్యాఖ్యలు చేశారు.పర్యాటక కేంద్రం నిర్మాణానికి రూ.4.70 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. దీని బాధ్యత మంత్రి పొన్నం ప్రభాకర్ అని సూచించారు. ఇక అంతేకాదు.. సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర గురించి ప్రజలకు తెలిసేలా పాకెట్ పుస్తకాలను ముద్రిస్తామని కీలక ప్రకటన చేశారు. ఇందిరమ్మ రాజ్యానికి కూడా సర్వాయి పాపన్న ఆలోచనలే మార్గదర్శకం అని అన్నారు. సర్దార్ పాపన్న చరిత్ర చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. గోల్కొండను కూడా దాదాపు 6 సంవత్సరాల కాలం పాటు పాలించాడంటే చాలా గొప్ప వీరుడనే చెప్పాలి.

## తెలంగాణలో ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులు..!

**తెలంగాణ వీణ/ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఆర్టీసి త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశ పెట్టనుంది. ఈ ఎలక్ట్రికల్ సూపర్ లగ్జరీ బస్సులను కరీంనగర్-హైదరాబాద్, నిజామాబాద్-హైదరాబాద్ మార్గాలలో నడపాలనీ ఆర్టీసీ నిర్ణయించింది.సూపర్ లగ్జరీ పేరుతో తీసుకు రానున్న ఈ బస్సులు ఇప్పటికే కరీంనగర్ డిపోకు 35, నిజామాబాద్ డిపోకు 13 చేరుకున్నాయి. ఈ బస్సులను ఆర్టీసీ ప్రయివేటు సంస్థ నుంచి అద్దెకు తీసుకుంది. అయితే ఇప్పటికే హైదరాబాద్ లో సిటీ బస్సులుగా, హైదరాబాద్- విజయవాడ మధ్య అంతరాష్ట్ర సర్వీసులుగా నడిపిస్తోంది. ఈయవన్నీ మెట్రో డీలక్స్ బస్సులు కాగా ప్రస్తుతం సూపర్ లగ్జరీ బస్సులను నడిపించనుంది.త్వరలోనే వీటిని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులవి ఎక్కువగా ఉండటంతో వీటి నిర్వహణకే అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అటు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొత్త బస్సులు కూడా కొనుగోలు చేయలేక పోతోంది.

# తెలంగాణ రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం..





**తెలంగాణ వీణ/పరకాల, ఆగస్టు 18:** తెలంగాణ రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో రూ.5కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు, రూ.11.74 కోట్లతో అమృత్ 2.0 పథకానికి సంబంధించిన పనుల ప్రారంభోత్సవానికి హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా పరకాలకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేరుకోగా స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, తదితరులు పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలను అందించి ఘనంగా స్వాగతం పలికారు. మున్సిపాలిటీ ఆవరణలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం పరకాల మున్సిపాలిటీ కార్యాలయంలో పరకాల శాసనసభ నియోజకవర్గ పరిధిలోని వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు.అనంతరం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. హైదరాబాద్ లో కూడా టెక్స్టైల్ పార్క్ తో పాటు అభివృద్ధి అంశాలపై సమీక్షించినట్లు చెప్పారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ తో ఈ ప్రాంత అభివృద్ధి రూపురేఖలు మారనున్నాయని అన్నారు. రోల్ మోడల్ గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల కొరియా పర్యటనకు వెళ్ళిన ముఖ్యమంత్రి టెక్స్టైల్ పార్క్ కు సంబంధించి పెద్ద కంపెనీలతో చర్చలు జరిపారని, ఆయా సంస్థల ప్రతినిధులు కొద్ది రోజుల్లో ఇక్కడ పర్యటించి టెక్స్టైల్ పార్కులో పరిశ్రమలు పెట్టడానికి సుముఖత వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఇది శుభవార్త అని అన్నారు. వరంగల్, హనుమకొండ మీదుగా వెళ్తున్న జాతీయ రహదారికి భూ సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం విలువైన భూములు అనేది వాస్తవమని, ప్రజలకు, రైతులకు ఎవరికి ఇబ్బంది లేకుండా పరిహారం అందిస్తామన్నారు. భూములు ఇస్తున్న రైతులకు మంచి పరిహారం అందిస్తుందని, ఈ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని పేర్కొన్నారు. ప్రజలకు రైతులకు అనుకూలంగా ఉండే విధంగా మంచి పరిహారం అందించాలని ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు. హైవే కోసం భూములు ఇస్తున్న రైతులకు 40 శాతం వరకు పరిహారం అందించినట్లు పేర్కొన్నారు. మిగతా పరిహారాన్ని అందించేందుకు స్థానిక శాసనసభ్యులు, ఇతర ముఖ్య నాయకులతో కలిసి రాబోయే కొద్ది రోజుల్లో గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం కావాల్సిన మొత్తం ఏరియాను కేంద్ర ప్రభుత్వానికి, ఎన్.హెచ్ కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందజేయనున్నట్లు తెలిపారు. వాటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తుందన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జల యజ్ఞం కార్యక్రమంలో భాగంగా కోనయమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ కోసం సుమారుగా రూ. 41 కోట్లను మంజూరు చేశారని చెప్పారు. పనులను పూర్తి చేసేందుకు ఏజెన్సీని కూడా ఫైనల్ చేశారని అన్నారు. అప్పుడు ఒకపక్క గోదావరి పరివాహక ప్రాంతం, మరో పక్క కృష్ణా పరివాహక ప్రాంతంలోని రిడ్జ్ లో ఈ లిఫ్టు ఉంటుందని, కాకతీయ కెనాల్ మీద లిఫ్టు ఏర్పాటు చేయడం కోసం ఆనాటి ముఖ్యమంత్రి డాక్టర్ వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని అన్నారు. దానికి సంబంధించిన డ్రైన్ సరైన వెడల్పు, పొడవు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం రూ.4కోట్లతో పనులను సరైన విధంగా టెక్నికల్గా చేపట్టలేదన్నారు. భవిష్యత్తుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరైన విధంగా డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గ్రామాలకు పట్టణాలకు మంచినీరు అందించేందుకు అమృత్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందించాల్సి ఉండగా ఆనాటి ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన నీటిని అందిస్తామని అన్నారని తెలిపారు. ఇటీవల మిషన్ భగీరథ కు సంబంధించి సర్వే నిర్వహించగా 51శాతం మంచి నీరు రావడం లేదని ఆ సర్వేలో తేలిందన్నారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకు, ఇళ్లకు స్వచ్ఛమైన తాగునీటిని తమ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. దీనిలో భాగంగానే 11 కోట్లకు పైగా నిధులతో పరకాలలో అమృత్ పథకానికి ప్రారంభోత్సవం చేసినట్లు తెలిపారు. అభివృద్ధిని సంక్షేమాన్ని సమతులంగా రాష్ట్రంలో చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మంజూరైన 11 కోట్ల రూపాయలతో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు, డ్రైనేజీ, తదితర అభివృద్ధి పనులను పూర్తిస్థాయి వివరాలతో కూడిన ప్రగతి నివేదికతో చేపడితే బాగుంటుందని అన్నారు. మెగా టెక్స్టైల్ పార్క్ కోసం భూముల కోల్పోయిన రైతులకు ఇండ్లను కేటా స్తామని ముఖ్యమంత్రి ప్రకటించా రని వెంటనే వారి పేర్ల జాబితాను అధికారులు రూపొందించి ఇవ్వాలన్నారు. సెప్టెంబర్ మూడో వారంలో మెగా జాబ్ మేళాను నిర్వహించబోతున్నట్లు తెలిపారు. మెగా జాబ్ మేళా తో టెక్స్టైల్ పార్క్ లో ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అన్నారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై ఇంచార్జ్ మంత్రిగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు ప్రత్యేక దృష్టిని పెట్టారని అన్నారు. ఉమ్మడి జిల్లాను మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ నేషనల్ హైవే కోసం పరకాల నియోజకవర్గ పరిధిలో భూ సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. భూములు ఇచ్చిన ఆయా గ్రామాల రైతులకు పరిహారం అందించినట్లు తెలిపారు. మిగతా రైతులకు పరిహారం అందించనున్నట్లు పేర్కొన్నారు. పరిహారం విషయంలో ఆయా గ్రామాల రైతులతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా వరద ముంపు ప్రభావం తప్పేవిధంగా పరకాలలో నాలా విస్తరణ పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ పరకాల నియోజకవర్గం పరిధిలో కోనాయమాకుల లిఫ్ట్ ఇరిగేషన్, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్, నేషనల్ హై వే ఉన్నాయన్నారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ కు సంబంధించి ఐదు కంపెనీలతో ఎం ఓ యు లు అయ్యాయని పేర్కొన్నారు. 52 కంపెనీలతో ఒప్పందాలు కానున్నాయని తెలిపారు. పరకాల మున్సిపల్ ఛైర్ పర్సన్ అనిత, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, పరకాల ఆర్డీవో డాక్టర్ కె. నారాయణ, మున్సిపాలిటీ కమిషనర్ నరసింహ, తహసిల్దార్లు, ఇతర శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్కాం

### • ఇరుకున పడ్డ సిఎం సిద్ధరామయ్య్న ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఆమోదం

**తెలంగాణ వీణ/బెంగళూరు,ఆగస్టు 18 :** మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్కాం కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరా మయ్య ప్రస్తుతం ఇబ్బందుల్లో పడ్డారు.ఆయనను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఆమోదం తెలిపారు. దీంతో ఇప్పుడు ఆయనపై కేసు నమోదు చేయనున్నారు.ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే భూ కేటాయింపుల్లో సీఎం సిద్ధరామయ్య అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. అంతేకాదు ఈ కేసులో గవర్నర్ ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధరా మయ్యకు షోకాజ్ నోటీసు పంపించారు. సిద్ధరామయ్యపై ఆర్‌టీఐ కార్యకర్త టీజే అబ్రహం కేసు దాఖలు చేశారు. అవినీతి నిరోధక చట్టం కింద సీఎంపై విచారణకు అనుమతి ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఆ క్రమంలో సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వాలని కోరారు.ఆయన ఆమోదం లేకుండా సీఎంపై కేసు పెట్టలేమని అందుకే అవినీతి నిరోధక చట్టం కింద సీఎంపై కేసు నమోదు చేయాలని అబ్రహం గవర్నర్‌ను డిమాండ్ చేశారు. సిద్ధరామయ్య, ఆయన భార్య, కుమారుడు, ముడా కమిషనర్‌పై కూడా కేసు నమోదు చేయాలని అబ్రహం తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ముడా కుంభకోణంలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కుంభకోణంలో సిద్ధరా మయ్య దంపతులు లబ్ధి పొందారని తెలుస్తోంది. 2021లో ముడా అభివృద్ధి కోసం మైసూరులోని కేసరే గ్రామంలో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతి నుంచి 3 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. ప్రతిఫలంగా ఆమెకు దక్షిణ మైసూర్‌లోని విజయనగర్‌లో భూమిని కేటాయించారు. విజయనగరంలో భూమి ధర కేసరెలో భూమి కంటే చాలా ఎక్కువ కావడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.దీంతో ముడా ద్వారా ఈ భూముల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాదు 2023 అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో తన భార్య యాజమాన్యాన్ని వెల్లడించడంలో సిద్ధరామయ్య విఫలమయ్యారని ఆర్టీఐ కార్యకర్త అబ్రహం తన ఫిర్యాదులో ఆరోపించారు. వాస్తవానికి ఓఆం కర్ణాటక రాష్ట్ర స్థాయి అభివృద్ధి సంస్థ. పట్టణాభివృద్ధిని ప్రోత్సహించడమే ఈ ఏజెన్సీ పని. దీంతో పాటు ప్రజలకు అందుబాటు ధరల్లో ఇళ్లను అందించాలి. కానీ సీఎం భార్యకు ఎక్కువ ధర ఉన్న భూమిని అప్పగించడంపై బీజేపీతోపాటు పలువురు నేతలు ప్రశ్నిస్తున్నారు.



## డబ్బుతో గాలం..! భాజపాపై హేమంత్ ధ్వజం



**తెలంగాణ వీణ/రాంచీ,ఆగస్టు 18 :** ఝార?ండ్ మాజీ ముఖ్యమంత్రి చంపయీ సోరెన్ భాజపాలో చేరతారంటూ ఊహాగానాలు వస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ పరిణామాలు జరగడం గమనార్హం.ఈ క్రమంలోనే జేఎంఎం నేత, సీఎం హేమంత్ సోరెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రజల్లో చీలిక తెచ్చేందుకు భాజపా యత్నిస్తోందని, డబ్బుతో ఎమ్మెల్యేలకు గాలం వేసేందుకూ ఆ పార్టీ వెనుకాడబోదని ఆరోపించారు."ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీల్లో విషాన్ని వ్యాప్తి చేసి.. వారు పరస్పరం పోట్లాడుకునేలా.. అస్సాం, మహారాష్ట్ర, గుజరాత్‌ల నుంచి కొంతమందిని భాజపా ఇక్కడ దించింది. సమాజంలో విభజనలు తేవడమే కాదు.. కుటుంబాలు, పార్టీలనూ విచ్ఛిన్నం చేసే పనిలో పడింది. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం ఆ పార్టీకి అలవాటే. డబ్బు విషయమే వస్తే.. రాజకీయ నాయకులు పార్టీలు మారేందుకు ఎక్కువ సమయం పట్టదు" అని గోడ్డా జిల్లాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సీఎం హేమంత్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రతిపక్ష పార్టీ నిర్ణయిస్తుందని, ఎన్నికల సంఘం కాదని విమర్శించారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో భాజపా తుడిచిపెట్టుకుపోతుందన్నారు.మరోవైపు.. తనకు జేఎంఎంలో అవమానాలు జరిగాయంటూ చంపయీ సోరెన్ ఇప్పటికే ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నందునే ప్రత్యామ్నాయం కోసం చూడాల్సి వచ్చిందన్నారు. అయితే, భాజపాలో చేరికపై స్పష్టత ఇవ్వలేదు.

## రుణమాఫీ కాలేదని కాంగ్రెస్ నేతలే అంటున్నారు : మాజీ మంత్రి హరీష్ రావు



**తెలంగాణ వీణ/హైదరాబాద్: ఆగస్టు 18 :**'మీ పార్టీ ప్రజా ప్రతినిధులే రుణమాఫీ కాలేదు అంటున్నారు. ఇప్పుడు ఎవరు రాజీనామా చేయాలో... ఎవరు ఏటిలో దూకి చావాలో... ఎవరికి చీము నెత్తురు లేదో...ఎవరు అమర వీరుల స్థూపం దగ్గర ముక్కు నేలకు రాయాలో... ఎవరు రాజీనామా చేయాలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని' అని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం ట్విట్టర్ వేదికగా సీఎంపై ఫైర్ అయ్యారు. కోదండ రెడ్డి, కోదండరాం రెడ్డి, ఆది శ్రీనివాస్ ముగ్గురు ఒప్పుకుంటున్నది రుణమాఫీ సంపూర్ణంగా కాలేదని.తాను అదే చెప్పానని, రాష్ట్రంలో పాక్షికంగా మాత్రమే రుణమాఫీ జరిగింది అని అన్నారు. 31 వేల కోట్లు అని చెప్పి 17 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని తానంటే ఎందుకు రంకెలేస్తున్నారని నిలదీశారు. రుణమాఫీ పూర్తయి ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎందుకు నిరసనలు తెలుపుతున్నారని, ఎందుకు సీఎం, ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతీ అంశాన్ని రాజకీయ కోణంలో చూడటం, తొండి చేసైనా తామే గెలిచినం అనే వైఖరి ప్రదర్శించడం అవివేకం అవుతుందన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి, రుణమాఫీ ప్రక్రియను తూతూ మంత్రంగా కాకుండా సమగ్రంగా పూర్తి చేయాలని, రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811

# మంకీపాక్స్‌పై ప్రధాని మోడీ సమీక్ష

**తెలంగాణ వీణ/ఆఫ్రికా,ఆగస్టు 18 :** మంకీపాక్స్ వైరస్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం సమీక్ష జరిపారు. ఈ వైరస్‌పై గ్లోబల్ ఎమర్జెన్సీ నేపథ్యంలో దేశంలో తీసుకోవల్సిన చర్యల గురించి ఉన్నతాధికారులతో , నిపుణులతో ఆయన చర్చించారు. ఆఫ్రికాలోని పలు దేశాలలో ఈ వైరస్ ఇప్పుడు ఎంపాక్స్‌గా నెలకొంది. పొరుగున ఉన్న పాకిస్థాన్‌లో కూడా కొన్ని కేసులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో తీసుకోవల్సిన జాగ్రత్త చర్యల గురించి ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఆదివారం ప్రధాని మోడీ కీలక ఆదేశాల మేరకు పిఎం ముఖ్యకార్యదర్శి పికె మిశ్రా అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా వైరస్ జాడలపై సరైన పర్యవేక్షణ పెట్టాలి. ఆసుపత్రులలో స్క్రీనింగ్ పద్ధతులను బలోపేతం చేయాల్సి ఉందని నిర్ణయించారు. విమాన ప్రయాణికుల రాకపోకల నేపథ్యంలో ఎయిర్‌పోర్టుల్లో , ఇదే క్రమంలో రైల్వేస్టేషన్లలో పర్యవేక్షక ఏర్పాట్లపై సమీక్షించారు.



ఇప్పటికైతే దేశంలో మంకీపాక్స్ కేసులు ఏమీ లేవు. దేశంలో ఈ వైరస్ విస్తరించే అవకాశాలు తక్కువే అని నిర్ధారించారు.అయితే తగు విధంగా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం మంచిదని నిర్ణయించారు. ప్రదాని మోడీ ఎప్పటికప్పుడు పరిస్థితిని తగు విధంగా పర్యవేక్షిస్తున్నారని పికె మిశ్రా తెలిపారు. ఈ వైరస్ లక్షణాలు , వ్యాప్తి క్రమం వంటి వాటిపై రాష్ట్రాల వారిగా వ్యాధుల నియంత్రణ విభాగం నుంచి తగు సూచనలు వెలువరించారు. దీనికి సంబంధించి మెడికల్ హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో రాష్ట్రాల నుంచి మొత్తం మీద 200 మంది వరకూ ప్రతినిధులుగా పాల్గొన్నారని వెల్లడైంది. 2022లో మంకీపాక్స్ తలెత్తిన నాటి నుంచి ప్రపంచవ్యాప్తంగా చూస్తే 99,176 మంకీ పాక్స్ కేసులు నమోదు అయినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ వైరస్‌తో మృతుల సంఖ్య 200 మందికి పైగా చనిపోయారు. ఆఫ్రికా దేశాలలోనే ఎక్కువ మరణాలు ఉన్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయాలలో రాకపోకల దశలో సరైన టెస్టులు నిర్వహించడం

---

# జమ్ముకశ్మీర్ ఎన్నికల్లో బిజెపి ఒంటరిగా పోటీ

**తెలంగాణ వీణ/జమ్ము,ఆగస్టు 18 :** జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ రవీందర్ రైనా ఆదివారం శ్రీనగర్‌లో విలేఖరుల సమావేశంలో స్పష్టం చేశారు. అయితే కశ్మీర్ వ్యాలీలో 8 నుంచి 10 మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో దిగే అవకాశం ఉందని, వారితో సంప్రదింపులు జరిపి పార్టీ గెలుపునకు బాటలు వేస్తామన్నారు. మొత్తం అన్ని స్థానాల్లో పోటీకి దిగుతామని, త్వరలో తొలివిడత అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామని ప్రకటించారు.పార్టీలో పీడీపీ మాజీ నేత ,



మాజీ మంత్రి చౌదరి జుల్ఫీకార్ అలీ తమ పార్టీలో చేరడంతో బీజేపీకి అదనపు బలం వచ్చినట్టయిందన్నారు. ఆర్టికల్ 370పై నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, మాజీ సిఎం ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలను రవీందర్ రైనా ఖండించారు. జమ్ము కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ తన ప్రాభవాన్ని కోల్పోయిందని, అందుకే ఆ పార్టీ నేత ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.

---

# చంపై సోరెన్ బిజెపిలో చేరబోతున్నారా?

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:ఆగస్టు 18 :** చంపై సోరెన్ జార?ండ్ లో ప్రస్తుతం జల వనరుల శాఖ మంత్రిగా ఉన్నారు. జనవరిలో ఈడి హేమంత్ సోరెన్ ను అరెస్టు చేశాక ఆయన ముఖ్యమంత్రి పదవి బాధ్యతలు తీసుకున్నారు. జార?ండ్ ముక్తి మోర్చా చీఫ్ హేమంత్ సోరెన్ కు చంపై సోరెన్ చాలా సన్నిహితుడు. అయితే ఆయన అనూహ్యంగా ఆదివారం ఉదయం ఢిల్లీకి వెళ్లడంతో చాలా ఊహాగానాలు ఊపందుకున్నాయి.చంపై సోరెన్ శనివారం రాత్రి కోల్ కతా హెూటల్ లో బిజెపి నాయకుడు సువేంధు అధికారితో భేటీ అయినట్లు 'ఇండియా టుడే' రాయడంతో ఊహాగానాలకు మరింత ఊపొచ్చింది. హేమంత్ సోరెన్ జైలు నుంచి విడుదల అయ్యాక చంపై సోరెన్ ముఖ్యమంత్రి పదవిని వదిలిపెట్టారని ఓ ఛానెల్ రిపోర్టు చేసింది. ఆయన ఇక బిజెపి బడా నాయకులతో ములాఖత్ అవుతారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. చంపై సోరెన్ వెంట ఆరుగురు ఎంఎల్ఏలు, వ్యక్తిగత సిబ్బంది ఢిల్లీకి వెళ్లినట్లు సమాచారం. చంపై సోరెన్, బిజెపి నాయకుడు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో కాంటాక్ట్ లో ఉన్నారని సమాచారం. ఆయనను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాక ఆయన బిజెపిలోకి మారాలనుకుంటున్నారని వినికిడి.



---

# ఆమె కంటే నేనే బెటర్:ట్రంప్

**తెలంగాణ వీణ/అమెరికా,ఆగస్టు 18 :** అమెరికా అధ్యక్ష బరిలో ఉన్న రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ తమ తుంపరితనం చాటారు. ప్రత్యర్థి కమలాహారిస్‌పై వ్యక్తిగత విమర్శలకు దిగారు.ఆమె కన్నా తానే బాగున్నానని వ్యాఖ్యానించారు. పైగా ఆమె నవ్వు మరీ భయంకరం అని కూడా స్పందించారు. ప్రస్తుత అధ్యక్ష ఎన్నికల ప్రచారసరళి ఈ వ్యాఖ్యలతో వేడెక్కింది. కమలా హారిస్‌రూపం, తన రూపాన్ని పోల్చుకుంటూ తన ముందు ఆమె వెలవెలే అన్నారు. మరి ఆమెను ఇటీవల టైమ్ మేగజైన్ ఎందుకు ముఖచిత్రానికి ఎంచుకుందో తెలియడం లేదని ట్రంప్ స్పందించారు. శనివారం పెన్సిల్వేనియాలో జరిగిన ప్రచార సభలో మాట్లాడారు. హారిస్ పట్ల ఈ పత్రిక వారు బాగా ఉదారతను చాటుకున్నారు. వీరి సంగతి ఏమిటో అర్థం కావడం లేదని పేర్కొంటూ ఈ క్రమంలో ఆయన కమలా హారిస్ అందం గురించి పేలవ రీతిలో మాట్లాడం వివాదాస్పదం అయింది. 59 ఏండ్ల ఆమె ఏ విధంగా ఉంది? 78 ఏండ్లు వచ్చిన నేను ఏ విధంగా కనబడుతున్నాను? మీరే పోల్చుకోండని సభికులను ప్రశ్నించారు. ఆమె ఫోటోలు అనేకం ప్రచురించారు. లాభం లేకుండా పోయిందేమో చివరికి బొమ్మలు వేసే సాయం తీసుకుని ఆమె బొమ్మ గీయించారని, ఆమె పట్ల వారికి ఎందుకింత పెద్ద మనస్సు ? అని ప్రశ్నించారు. ప్రచార పర్వంలో ఎప్పుడూ దూకుడుగా మాట్లాడటం ట్రంప్ నైజం అయింది. ఇంతకు ముందు కూడా తనకు ఎవరు రాజకీయంగా ఎదురొచ్చినా వారిని తిట్లతో ముంచెత్తడం ట్రంప్ తంతు అయింది. పెన్సిల్వేనియా సభలో ట్రంప్ దాదాపు రెండు గంటల పాటు ప్రసంగించారు. ముందుగా ఆయన కమలా హారిస్ ఆర్థిక విధానాలపై మండిపడ్డారు. కానీ ఆయన ప్రసంగం దారితప్పి , చివరికి హారిస్‌పై వ్యక్తిగత దాడికి దారితీసింది. నవంబర్ 5న జరిగే ఎన్నికల ప్రచారంలో ఎక్కువగా పాలసీల గురించి



మాట్లాడాలని, పక్కదారులు వద్దని ట్రంప్ మిత్రులు కూడా చెపుతూ వస్తున్నారు. అయితే వీటిని పెడచెవిన పెట్టి ట్రంప్ మరో సారి తన నైజం చాటుకున్నారు.నవంబర్ ఎన్నికలలో ఈ రాష్ట్రం జయాపజయాల ఖరారుకు అత్యంత కీలకం. అక్కడ మొత్తం 19 ఎలక్టోరల్ కాలేజ్ ఓట్లు ఉన్నాయి. 2020 ఎన్నికల్లో ఆయన ఇక్కడ బైడెన్ కన్నా తక్కువ ఓట్లు పొందారు. ఇక్కడి సభలోనే ఆయన తన ప్రత్యర్థి మారాడని, ముందు తెరపైకి వచ్చిన బైడెన్ ఎటు పోయినట్లు? మధ్యలోనే జారుకున్నారు. ఇప్పుడు వేరే వ్యక్తి రంగంలోకి వచ్చారు. ఇప్పుడు తాను ఎదుర్కొంటున్నది ఎవరిని? ఓహ్ ఈ హారిస్‌నా? ఇంతకూ ఈ హారిస్ ఎవరండి బాబూ అని చమత్కరించారు. ఈ మధ్యనే ఆమె దేశ ఆర్థిక విధానాలకు సంబంధించి చెప్పిందని, ఇవన్నీ అవాకులుచవాకులు తప్పితే ఏమీ కాదని స్పందించారు. ధరలు తగ్గిస్తామని, పన్నుల మోత ఉండదని చెపుతున్న ఆమె ఇంతకు ముందటి హయాంలో ఏం చేశారని నిలదీశారు. బైడెన్‌ను అమాయకుడిని చేసి , ఆయన సీటును దొంగిలించారని చెప్పారు. బైడెన్‌కు కమలా అంటే వొళ్లు మంట, ఆమెను లోపలలోపల తిట్టుకుంటూ ఉంటారని వ్యాఖ్యానించారు.దేశంలో ఉపద్రవకర ద్రవ్యోల్బణం తీసుకువచ్చి , ఇప్పుడు ఆమె తీరిగ్గా సోషలిస్టు ధరల నియంత్రణ పంథాకు దిగుతానని చెపుతున్నారని, చేసిందేమిటీ? ఇప్పుడు చెపుతున్నదేమిటీ? అని ప్రశ్నించారు. ట్రంప్ వ్యాఖ్యలు ఇతరత్రా విషయాలను ప్రస్తావించిన హారిస్ వర్గం ఆయన మరో సభ మరోసారి అదే ప్రదర్శన అని తిప్పికొట్టారు.



## కదులుతున్న బస్సులో బాలికపై సామూహిక అత్యాచారం

**తెలంగాణ వీణ/ఉత్తరాఖండ్,ఆగస్టు 18 :** ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో దారుణం జరిగింది. ఆగస్టు 12న అర్ధరాత్రి దాటిన తర్వాత 15 ఏళ్ల బాలికపై కదులుతున్న బస్సులో సామూహిక అత్యాచారం జరిగింది.పంజాబ్‌కు చెందిన బాలిక ఢిల్లీ నుంచి డెహ్రాడూన్‌కు బయల్దేరింది. బస్సు డ్రైవర్, కండక్టర్‌తో సహా ఐదుగురు ఆమెపై సామూహిక అత్యాచారం చేశారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (అధికారులు బాధిత బాలికను సంరక్షణా కేంద్రానికి తరలించారు. నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

## ఏపీవాసులకు బిగ్ అలర్ట్.. ఈ జిల్లాలలో రేపు భారీ వానలు



**తెలంగాణ వీణ/ఏపీ, ఆగస్టు 18 :**ఏపీవాసులారా.. బీ అలర్ట్.. వచ్చే రెండు రోజులు ఏపీలో భారీవర్షాలు కురవనున్నాయి. ఆవర్తనం ప్రభావంతో ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఆవర్తనం ప్రభావంతో ఆదివారం.. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం, విశాఖప, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ప్రకాశం, నంద్యాల జిల్లాలలో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. అలాగే కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేశారు.

## లిఫ్ట్ ఇచ్చి అత్యాచారం

**తెలంగాణ వీణ/బెంగళూరు,ఆగస్టు 18 :** ఆదివారం అర్ధరాత్రి తరువాత బెంగళూరు నగరంలో 21 ఏండ్ల యువతిపై అత్యాచారం జరిగింది. లిఫ్ట్ ఇచ్చిన ఓ బైకర్ ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. కాలేజీ విద్యార్థిని అయిన ఈ అమ్మాయి ఓ విందుకు వెళ్లి వస్తుండగా , ఓ గుర్తు తెలియని వ్యక్తి లిఫ్ట్ ఇచ్చాడు. ఆమె చెప్పిన చోటికి కాకుండా ఎవరూ లేని ప్రాంతానికితీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు నగర ఈస్ట్ జోన్ పోలీసు అదనపు కమిషనర్ రామన్ గుప్తా తెలిపారు. ఆమెపై దాడి జరిపి తరువాత అత్యాచారానికి దిగినట్లు నిర్ధారణ అయింది. రాత్రి ఒంటి గంట తరువాత ఈ ఘటన జరిగింది. హెచ్ఎస్ఆర్ లే ఔట్‌లోని హెూసూర్ సర్వీసు రోడ్డు వద్ద ఓ ట్రక్కు పక్కన దాదాపుగా ఆమె నగ్నంగా పడి ఉంది. కేవలం ఎరుపు జాకెట్ ఆచ్ఛాదనే ఉంది. దీన స్థితిలో పడి ఉన్న ఈ యువతిని గుర్తించి వెంటనే సమీపంలోని ఆసుపత్రికి చికిత్సకు తరలించినట్లు పోలీసు అధికారి చెప్పారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. సంబంధిత ఘటనపై నూతన భారతీయ న్యాయ చట్టం బిఎన్ఎస్ పరిధిలో కేసు దాఖలు చేశారు. దర్యాప్తు చేపట్టారని కూడా ఎసిపి వివరించారు.

## ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొ.కోదండరాంను కలిసిన డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి..

**తెలంగాణ వీణ/తార్నాక :** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన తెలంగాణ ఉద్యమ రథసారథి ప్రొఫెసర్ కోదండరాం తార్నాక లోని వారినివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మరియు తెలంగాణ ఉద్యమకారుడు, టీ టీ యు సి రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి .ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్ రావు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# 2,250 కిలోల నల్లబెల్లం పట్టివేత

**తెలంగాణ వీణ/కర్నూల్,ఆగస్టు 18 :** నాటుసారా తయారీకి వినియోగించే నల్లబెల్లం సరఫరా చేసే ఇద్దరు వ్యక్తులపై నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి 2,250 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ నుంచి చాలా కాలంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని తెలకపల్లి, కొల్లాపూర్ ప్రాంతాలకు నాటుసారాకు వినియోగించే బెల్లం, పటికను పోలీసులకు దొరకకుండా సరఫరా చేస్తూ ఉన్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నారు. మహబూబ్‌నగర్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పక్కాగా అందుకున్న సమాచారం మేరకు ఆదివారం తెల్లవారుఝామున బిజినేపల్లి బస్టాండ్ దగ్గర రోడ్డు వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. కర్నూల్ నుంచి వచ్చిన బొలెరో పికప్ వాహనాన్ని నిలిపి తనిఖీలు నిర్వహించగా అందులో ఉన్న 75 బ్యాగుల బెల్లం,ఒక బ్యాగులో 30 కేజీలు మొత్తం 2250 కేజీల బెల్లాన్ని, 5 లీటర్ల నాటుసారాను పట్టుకున్నారు. ఈ బెల్లాన్ని సరఫరా చేస్తున్న దేవుల తిరుమలాపూర్ గ్రామం పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన పుట్ట శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశారు. వట్టిపల్లి తండా, తెలకపల్లి మండలంకు చెందిన ముడావత్ ప్రతాప్ పరారీలో ఉన్నాడు. అతడిని త్వరలోనే అరెస్టు చేస్తామని నాగర్‌కర్నూల్ ఆబ్కారీ స్టేషన్ సిఐ జి.కళ్యాణ్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ప్రకారం వాహనం, బెల్లం విలువ రూ.12 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. బెల్లాన్ని పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఇఎస్ శ్రీనివాస్, సిఐలు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, శారద, ఎస్ఐ సృజన్‌రావుతో పాటు సిబ్బంది చంద్రయ్య, సూర్యం, మునిందర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. బెల్లం సరఫరా చేస్తున్న వాహనాన్ని పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను, సిబ్బందిని, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్ రెడ్డి అభినందించారు.



# విభజనచట్టంపై సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు సింఘ్వీకి రాజ్యసభ : సీఎం రేవంత్

**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 18 :** విభజనచట్టంపై సుప్రీంకోర్టులో బలంగా వాదనలు వినిపించేందుకు అభిషేక్ మను సింఘ్వీని రాష్ట్రం నుంచి రాజ్యసభకు పంపాలని అధిష్ఠానాన్ని కోరామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని ప్రతిపాదించిన వెంటనే ఆమోదించినందుకు అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్ర పునర్విభజన చట్టం అమలులో అనేక రాజ్యాంగ, న్యాయపరమైన చిక్కులు, అవాంతరాలు ఉత్పన్నమయ్యాయని.. 2014 పునర్విభజన చట్టాన్ని పదేళ్లపాటు కేంద్రం అమలు చేయలేదన్నారు. పునర్విభజన చట్టంలోని అంశాలను చట్టసభలతోపాటు సుప్రీంకోర్టులో బలంగా వాదన వినిపించాల్సిన అవసరం ఉందని.. అందుకే రాజ్యాంగ, న్యాయ కోవిదుడు అభిషేక్ మను సింఘ్వీని తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపాలని అదిష్ఠానాన్ని కోరినట్లు తెలిపారు. అపరిష్కృతమైన సమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో న్యాయస్థానాల్లో అభిషేక్ మను సింఘ్వీ గట్టిగా వాదిస్తారన్నారు. మాజీ ఎంపీ కేకే పెద్దమనసుతో క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా వ్యవహరించారన్నారు.



# ట్యాంక్‌బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి..

**- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన కేటీఆర్**

**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 18 :** ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలోని ఏదో ఒక జిల్లాకు ఆయన పేరును పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని మొదటి బైపాస్ రోడ్డులోని సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బహుజన రాజ్యాంగం కోసం, తెలంగాణ ప్రాంతంలో నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు సర్వాయి పాపన్న అని తెలిపారు. ఆయన ఆశయాలను సాధించే దిశగా గత కేసీఆర్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గౌడన్నలకు చెట్ల పన్నులను, అప్పటిదాకా ఉన్న బకాయిలను పూర్తిస్థాయిలో మాఫీ చేసిందని గుర్తు చేశారు.ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఏదో ఒక జిల్లాకు నామకరణం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అనంతరం సిరిసిల్ల పట్టణంలో జరుగుతున్న మార్కండేయ ఆలయ నిర్మాణంలో భాగంగా మహా చండీయాగంలో కేటీఆర్ పాల్గొన్నారు. మహా చండీయాగంలో కేటీఆర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు కేటీఆర్‌ను ఘనంగా సత్కరించారు. ఆలయ నిర్మాణానికి స్థానిక శాసనసభ్యుడిగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం సిరిసిల్లలో నెలకొన్న నేతన్నల వస్త్ర పరిశ్రమ సంక్షోభం అమ్మవారి ఆశీస్సులతో తీరాలని కోరుకున్నట్లు తెలిపారు.





# కాంగ్రెస్ ఎమ్మెల్యే వేధింపులు తాళలేక మున్సిపల్ కౌన్సిలర్ ఆత్మహత్యాయత్నం

**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 18 :** రాష్ట్రంలో కాంగ్రెస్ గుండాల ఆగడాలు రోజురోజుకు శృతి మించుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ గుండాల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. బీఆర్ఎస్ పార్టీయే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అకారణం గా దాడులకు పాల్పడుతున్నారు. తాజాగా మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావువేధింపులు తాళలేక మున్సిపల్ కౌన్సిలర్ ఆత్మహత్యాయత్నం చేశారు.కాంగ్రెస్ ఎమ్మెల్యే తనను వేధిస్తూ, పోలీసుల చేత తనపై అక్రమ కేసులు పెట్టిస్తున్నాడని మాజీ ఎంపీపీ, నస్పూర్ మున్సిపల్ 21వ కౌన్సిలర్ బేర సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆగడాలు భరించలేక మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయం వద్ద సర్జికల్ బ్లేడ్‌తో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సత్యనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# బీఆర్ఎస్ పార్టీపై ఫేక్ న్యూస్.. ఆర్‌టీవీ, రవి ప్రకాశ్‌కు లీగల్ నోటీసులు




**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 18 :** తమపై తప్పుడు ప్రచారం చేస్తున్న ఆర్‌టీవీపై బీఆర్ఎస్ చర్యలకు ఉపక్రమించింది. బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనం అని ఫేక్ వార్తలు ప్రచారం చేసిన ఆర్‌టీవీ, రవి ప్రకాశ్‌కు లీగల్ నోటీసులు పంపించింది.గత పదేళ్ల నుంచి బీజేపీతో బీఆర్ఎస్ విబేధిస్తుందని ఆ లీగల్ నోటీసులో గుర్తుచేసింది. కానీ ఆర్‌టీవీలో ప్రచారం చేసిన అసత్య ప్రచారం వల్ల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ప్రభావితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ప్రచారంతో బీఆర్ఎస్ ప్రతిష్ఠ దెబ్బతిన్నదని తెలిపింది. బీఆర్ఎస్ పార్టీపై ఆర్‌టీవీలో ప్రసారంచేసిన అసత్య ప్రచారాలకు సంబంధించిన యూట్యూబ్ లింకులను ఆ నోటీసులో పేర్కొన్నది.సదరు లింక్‌లను తక్షణమే తొలగించాలని ఆర్‌టీవీని ఆ నోటీసుల్లో డిమాండ్ చేసింది. బీఆర్ఎస్ పార్టీపై అసత్య ప్రచారాలను ఇప్పటికైనా మానుకోవాలని సూచించింది. ఫేక్ న్యూస్ ప్రచారం చేసినందుకు బీఆర్ఎస్ పార్టీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. భారతీయ కుటుంబంలో పెను విషాదం



**తెలంగాణ వీణ/అమెరికా,ఆగస్టు 18 :** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భారతీయ సంతతి కుటుంబంలో పెను విషాదం నింపింది. అమెరికాలోని టెక్సాక్ రాష్ట్రంలో లంపాసస్ కౌంటీ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. డల్లాస్‌లోని కాలేజీకి కూతురును తీసుకువెళ్లుతున్న దంపతులు అరవింద్ మణి (45), ప్రదీప అరవింద్ (40)ల కారు ఆక్సిడెంట్‌లో ధ్వంసం అయినట్లు ఈ ఘటనలో ఈ భార్య భర్తలు, వీరి కూతురు 17 సంవత్సరాల అండ్రిల్ అరవింద్ మృతి చెందినట్లు ఆస్టిన్ అమెరికన్ స్టేట్స్‌మెన్ పత్రిక తెలిపింది. కాగా ఈ ఘటన దశలో కారులో లేకపో వడంతో కుమారుడు 14 సంవత్సరాల అదిరయన్ ప్రాణాలు దక్కాయి. ఈ కుటుంబంలో ఈ బాబు ఒక్కడే మిగిలాడు. కారు వేగంతో వెళ్లుతూ మరో వాహనాన్ని ఢీకొందని స్థానిక ప్రత్యక్ష సాక్షులు, సీసీటీవీ కెమెరాల పరిశీలన తరువాత అదికారులు తెలిపారు. ఈ వాహనంలోని ఇద్దరు కూడా మృతి చెందారు.

## జోగిపేటలో దారుణం.. ఆస్తి కోసం కన్నతండ్రి ప్రాణాలు తీసిన కొడుకు



**తెలంగాణ వీణ/సంగారెడ్డి :ఆగస్టు 18 :** సంగారెడ్డి జిల్లా జోగిపేటలో దారుణం చోటు చేసుకుంది. ఆస్తికోసం కన్నతండ్రి ప్రాణాలనే తీశాడో ప్రబుద్ధుడు. వివరాల్లోకి వెళ్తే..జోగిపేటకు చెందిన కుమ్మరి నారాయణకు వీరేశం అనే కొడుకు ఉన్నాడు. తండ్రి ఆస్తిని ఎలాగైనా కాజేయాలని కుట్రపన్నిన వీరేశం. తండ్రిని ఉరివేసి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. వీరేశంను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరారాలు తెలయాల్సి ఉంది. కాగా, నారాయణ మృతితో జోగిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## యాదగిరిగుట్టలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :ఆగస్టు 18 :** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతున్నది. ఆదివారం సెలవు దినం కావడంతో స్వామి వారిని దర్శించు కునేందుకు భక్తులు పోటెత్తారు. దీంతో క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. ఉచిత దర్శనానికి రెండు గంటల సమయం ప్రత్యేక దర్శనానికి గంట సమయం పడుతుందని ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ పెరగడంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇంబ్బంది కలుగకుండా చూస్తున్నారు.

## నాగర్‌కర్నూల్ జిల్లాలో భారీగా నల్లబెల్లం పట్టివేత

**తెలంగాణ వీణ/నాగర్‌కర్నూల్:ఆగస్టు 18 :** గుడుంబా తయారీకి వినియోగించే నిషేధిత నల్లబెల్లం అక్రమ రవాణా చేస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూల్ జిల్లాలోని బిజినపల్లి మండలం తెలకపల్లి తండాకు భారీగా నల్ల బెల్లం తరలిస్తున్నారనే సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు.పెద్ద మొత్తంలో నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.6 లక్షల విలువ ఉంటుందని తెలిపారు. నిషేధిత నల్ల బెల్లం అమ్మినా కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## మొగల్ పాలకుల గుండెల్లో సింహ స్వప్నంగా

# సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

**- విగ్రహానికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**







**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆదివారం యాదిగిరిగుట్ట పట్టణంలో,ఆలేరు పట్టణంలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ బహుజన చక్రవర్తి దళిత బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా యాదగిరిగుట్ట ఆలేరు పట్టణంలో నివాళులర్పించడం జరిగిందన్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం,ఖిలా షాపూర్ గ్రామం లో ఆగస్టు 18న1650 సంవత్సరంలో సగోని ధర్మన్న, సర్వమ్మ లకు జన్మిచండన్నారు.పాపన్న ఏలాంటి వారసత్వ నాయకత్వం లేకున్నా బహుజన చక్రవర్తిగా వెలుగొందాడు,మొగల్ పాలకుల గుండెల్లో సింహ స్వప్నంగా నిలిచాడని,పూలే కంటే ముందే సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతికై,బహుజన సామ్రాజ్య స్థాపనకు కృషి చేశాడు.బహుజనులు ఏకమై పోరాడితే రాజాధికారం వస్తుందని నిరూపించిన గొప్ప సామాజిక విప్లవకారుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.17వ శతాబ్దంలోనే సొంత సైన్యంతో దాడి చేసి దక్కన్ పీఠభూమిలో తొలి బహుజన సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసిన గొప్ప వీరుడని కొనియడారూ ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట,ఆలేరు పట్టణాల మున్సిపల్ కౌన్సిలర్లు, మండల, పట్టణ నాయకులు కార్యకర్తలు గౌడ కుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

---

# ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్... నిరసన ప్రదర్శన

**- ఆటో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కొమురెల్లి బాబు డిమాండ్**



**తెలంగాణ వీణ/తార్నాక:** హబ్సిగూడలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యమూలాన ప్రాణాలు కోల్పోయిన బాలిక కుటుంబాన్ని, తీవ్ర గాయాలు పాలైన ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో ర్యాలీ, నిరసన వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు కొమురెల్లి బాబు మాట్లాడుతూ..నో ఎంట్రీ సమయంలో భారీ వాహనాలు సిటీలోకి అనుమతించడంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, కావున ఇట్టి విషయాల పైన ప్రభుత్వం బాధ్యత వహిస్తూ ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా నో ఎంట్రీ సమయంలో భారీ వాహనాలు అనుమతించరాదని డిమాండ్ చేశారు. తరచు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నప్పటికీ జిహెచ్ఎంసి అధికారులు సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్నారు తప్ప పూర్తిస్థాయి నియంత్రించడంలో విఫలం అయ్యారని దుయ్యబట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు జోగు రాములు, శ్రీహరి, హుస్సేన్, శివ, రవికాంత్, వెంకట్ గౌడ్, సయ్యద్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

---

# డంపింగ్ యార్డును ఎత్తివేయాలని ధర్నా...





**- రోడ్డుపై బైఠాయించిన కాలనీవాసులు ....**
**- సాకేత్ దమ్మాయిగూడ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్... - రాకపోకలకు అంతరాయం...**

**తెలంగాణవీణ/కాప్రా:** కాప్రా సర్కిల్ పరిధిలోని సాకేత్ సమీపంలో వెలిసిన డంపింగ్ యార్డును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తు కాలనీవాసులు ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పలు మార్లుగా ఇక్కడి డంపింగ్ యార్డును ఎత్తివేయాలని అధికారులకు వినతి చేసినా ఫలితం లేకపోవటంతో ధర్నాచేపట్టారు. సుమారు 15 కాలనీల వాసులు డంపింగ్ యార్డు సమస్యతో సతమతమైతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు పక్కనే వెలిసిన డంపింగ్ యార్డు కారణంగా దుర్వాసన వ్యాపిస్తోందని కాలనీల్లో ఉండలేకపోతున్నామన్నారు. అసలే జవహార్ నగర్ డంపింగ్ యార్డుతో ఇబ్బందుకు గురవుతుంటే , కాలనీల సమీపంలోనే సాకేత్ నుంచి దమ్మాయిగూడ వెళ్లే ప్రధాన రహాదారి పక్కనే డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ప్రైవేటు స్థలంలో చెత్త కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై కాలనీ ప్రతినిధులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ప్రభుత్వ స్థలమంటూ అధికారులు, కాదు ఇది ప్రైవేటు స్థలమని పలువురు కొర్డును ఆశ్రయించారు. ఈ స్థలవివాదం కొనసాగుతుండగా తాజాగా డంపింగ్ సమస్యపై స్థానికులు ఆందోళన చెపడుతున్నారు. వెంటనే ఇక్కడి డంపింగ్ యార్డును ఎత్తివేయాలని లేని పక్షంలో తమ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాలనీవాసుల ఆందోళనతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో జవహార్ నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులతో చర్చిస్తామని చెప్పి కాలనీవాసులకు సర్ధిచెప్పి, ఆందోళన కారులను శాంతింపజేశారు. ధర్నాలో సాయిరాంనగర్ కాలనీ ప్రతినిధులు అశోక్ గౌడ్, పద్మారెడ్డి, కోండల్ గౌడ్లతో పాటు పలు కాలనీల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



## ఘనంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**తెలంగాణవీణ/కాప్రా:** బహుజన విప్లవ వీరుడు, గోల్కొండ కోటపై మొట్టమొదటగా జెండా ఎగురవేసి బహుజన రాజ్యాన్ని విస్తరించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఈసీఐఎల్ చౌరస్తా వద్ద సర్వాయి పాపన్న చిత్రపటానికి గౌడ హాస్టల్ సభ్యులు పండాల శివకుమార్ గౌడ్ పూలమాల వేసి మహనీయుడికి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ ఇప్పటి యువత ,విద్యార్థులు సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నెరవేర్చే దిశగాపయనించాలని కోరారు. కార్యక్రమంలొ సంకూరి శ్రీనివాస్ గౌడ్, పనగట్ల చక్రపాణి గౌడ్, పంజాల బాబు గౌడ్, తాళ్ల ఆనంద్ గౌడ్, చిత్తుల కిషోర్ గౌడ్, పంజాల శ్రీనివాస్ గౌడ్, బుడంపల్లి రఘుపతి గౌడ్, ప్రేమ్ గౌడ్ బుడంపల్లి వెంకటేష్ గౌడ్,రాంచందర్ గౌడ్, దినేష్, ఆంజనేయులు గౌడ్ లు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహన్ని ఆవిష్కరణ చేసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య





**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రం లో ఈరసారపు యదగిరిగౌడ్ సభ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహన్నీ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ..బహుజన చక్రవర్తి దళిత బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా యాదగిరిగుట్ట ఆలేరు పట్టణంలో నివాళులర్పించారు.జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం, ఖిలా షాపూర్ గ్రామం లో ఆగస్టు 18న1650 సంవత్సరంలో సగోని ధర్మన్న, సర్వమ్మ లకు జన్మిచండన్నారు.పాపన్న ఏలాంటి వారసత్వ నాయకత్వం లేకున్నా బహుజన చక్రవర్తిగా వెలుగొందాడు,మొగల్ పాలకుల గుండెల్లో సింహ స్వప్నంగా నిలిచాడు,పూలే కంటే ముందే సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతికై,బహుజన సామ్రాజ్య స్థాపనకు కృషి చేశాడు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మలన్న ,మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





## న్యూ వెంకటేశ్వర నగర్ కాలనీ అధ్యక్షుడిగా బుద్ధి నర్సింగరావు

**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** మౌలాలి డివిజన్ న్యూ వెంకటేశ్వర నగర్ కాలనీ అధ్యక్షుడిగా బుద్ధి నర్సింగరావు మూడోసారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ గౌడ్, గౌరవ అధ్యక్షులు రామకృష్ణ చారి ఎన్నికయ్యారు. ఆదివారం అధ్యక్షుడు బుద్ధిని నరసింహారావు మాట్లాడుతూ కాలనీ సంక్షేమం కోసం అందరిని కలుపుకొని అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానని అన్నారు. కాలనీలోని ప్రతి సమస్యను అది, కారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి నిరంతర కృషి చేస్తా అ న్నారు. తనపై నమ్మకంతో మూడోసారి అధ్యక్షుడిగా ఎన్ను కున్నందుకు కాలనీ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

## నేరేడ్మెట్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిలిఆదివారం సందర్భంగా నేరేడ్మెట్ లోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు .ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ వగ్గు చంద్రశేఖర్ రావు, లిభాగ్యనగర గణేష్ ఉత్సవ కమిటీ నాయకులు ఆనంద్, నవీన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ ప్రేమ్ కుమార్



**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** సే నాయ్ హాస్పిటల్ మారడ్ పల్లి వారి ఆధ్వర్యంలో ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర్ నగర్ వార్డు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అర్జున్ దీన్ దయాల్, అంకిత దీన్ దయల్, మాసెందర్ యాదవ్, క్రాంతి, వెంకట సుదీర్, సూరజ్, కాంగ్రెస్ నాయకులు సత్యమూర్తి, సత్యనారాయణ, సంపత్ రావు, బ్రహ్మయ్య, రాము, కిషోర్, రత్న భూషణ్ రావు, శివ, ప్రతాప్, సింగ్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

## యువదళ్ ఆధ్వర్యంలో మల్లాపూర్‌లో కొవ్వొత్తులతో నివాళి...

**తెలంగాణ వీణ/నాచారం:** పశ్చిమబెంగాల్లోని కలకత్తాలో ట్రైని డాక్టర్ అత్యాచారం చేసిన సంఘటనలో నిందితులను ఉరితీయాలని మల్లాపూర్ యువదళ్ అధ్యక్షులు ఎండి. ఉస్మాన్ అన్నారు. మల్లాపూర్ యువ దళ్ ఆధ్వర్యంలో డాక్టర్ మౌనిత దేబ్ నాథ్ ఆత్మ శాంతి కోరుతూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించి ఎలిఫెంట్ చౌరస్తా వద్ద డాక్టర్ మౌనిత చిత్రపటానికి పూలమా లవేసి నివాళులు అర్పించి మౌనం పాటించారు. ఇలాంటి సం ఘటనలు జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. బాధ్యులను వెంటనే శిక్షించాలని ఎండి ఉస్మాన్ కోరారు.



# మహిళలపై అత్యాచారాలను, దాడులను ఆపండి : ఎస్‌హెచ్ యూత్ ఫ్రెండ్స్

### - మహిళలపై లైంగిక దాడికి పాల్పడాలంటే వెన్నులో భయం పుట్టించే కఠినమైన చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలి: కుమ్మరి రాజు




**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** ఇటీవల కోల్‌కతా లో మహిళ డాక్టర్ పై జరిగిన అత్యాచారం, హత్యను ఖండిస్తూ ఆదివారం ఎస్ హెచ్ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వైద్యురాలిపై అగత్యానికి తెగబడిన మానవ మృగాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలని, జస్టిస్ ఫర్ డాక్టర్ అంటూ నినాదాలు చేస్తూ మల్కాజిగిరి నియోజకవర్గం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ చౌరస్తా నుండి మల్కాజిగిరి చౌరస్తా వరకు ప్లకార్డ్స్ తో నిరసన తెలుపుతూ పాదయాత్ర నిర్వహించారు. మహిళలు, అమ్మాయిలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కేంద్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకురావాలని నిర్వాహకుడు మహమ్మద్ సమీ, మహమ్మద్ హసన్, కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ హెచ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు మొహమ్మద్ జునేద్, శ్రీను చెంచల్ వంశీ తోపాటు మానవసేవే మాధవసేవ ప్రతినిధులు కుమ్మరి రాజు, డాక్టర్ సుధాకర్, జగపతి, సుధాకర్, లయన్ హనుమంతరావు, పాండు, వెంకటేష్ , రెడ్డిపల్లి శ్రీనివాస్, గణేష్ యాదవ్, నవీన్, మొహమ్మద్ జిలానీ, తోపాటు స్థానిక యువకులు పాల్గొన్నారు.

# వడ్డెర కులస్తుల స్మశాన వాటికకు మాలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికు వడ్డెర కులస్తుల నాయకుల వినతి



**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** మౌలాలి డివిజన్ పరిధిలోని వడ్డెర కులస్తులకు చెందిన స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరుతూ ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసిన వడ్డెర కులస్తులు, నాయకులు, వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వీలైనంత త్వరగా వడ్డెర స్మశాన వాటికలో మౌలిక వసతులు సదుపాయాల కోసం కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. .అంతే కాకుండా రేపటి నుండి పేరుకుపోయిన చెత్త తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెనకబడిన వడ్డెర కులం ఆర్థికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉన్నదని, ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో వడ్డెర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు గండికోట కుమార్, మౌలాలి అధ్యక్షుడు నర్సింగ్ రావు, కోశాధికారి రమేష్ సలహాదారుడు చంద్రయ్య తదితరులున్నారు.

# మాలమహానాడు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భారత్ బంద్


**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** ఎస్సీ. ఎస్టీ ల పైన సుప్రీం కోర్టు తీర్పు రద్దు చేయాలనీ ఆగష్టు 21న జరిగే భారత్ బందును విజయవంతంచేయాలిమాలమహానాడు జాతీయ అధ్యక్షులు డా పసుల రాంమూర్తి ఎస్ సి వర్గీకరణ సుప్రీం కోర్టు తీర్పు కు వ్యతిరేకంగాఆగస్టు 21 న భారత్ బంద్ పిలుపు ఇవ్వడం జరిగిందని అన్నారు . ఆదివారం నేరేడ్మెట్ల ఆయన మాట్లాడుతూ ఈ మేరకు నేడు కరీంనగర్ జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు బొగ్గుల మల్లేశం అధ్యక్షతన జరిగిన మాలమహానాడు ఆఫ్ ఇండియా కార్యాచరణ ను రూపొందించికోవడం జరిగిందని జాతీయ అధ్యక్షులుడా పసుల రాంమూర్తి పిలుపు ఇచ్చారు. దళిత జాతి రాజ్యాధికారం ను సాధించకుండా.. అణిచివేయాలని మనువాద పాలక పార్టీలు సామాజిక కుట్రలు చేశాయన్నారు. ఇందులో భాగంగా వర్గీకరణ అంశం అని తెలిపారు. రాజ్యాంగంను రిజర్వేషన్‌లను రద్దు చేయడానికి సుప్రీం కోర్ట్ తీర్పు ద్వారా పాలక మనువాద ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపణలు చేసారు. వర్గీకరణ కు వ్యతిరేకంగా 21న దేశంలో డా బి ఆర్ . అంబేద్కర్ విగ్రహాలు వద్ద పోరాటం ర్యాలీ లు నిర్వహించాలని తెలిపారు. వర్గీకరణ అంతం.. దళితుల పంతం.. అనే నినాదం తో పెద్ద ఎత్తున పోరాటం చేయాలన్నారు. వర్గీకరణ కు అనుకూలంగా ఉన్న అన్నీ దోపిడీ కుల పార్టీ ల భరతం పట్టాలని కేంద్రం. రాష్ట్ర సర్కార్ లను మెడలు వంచడానికి సిద్ధం కావలిసిన సమయం ఆసన్నమై నదన్నారు. బీజేపీ కేంద్రం సుప్రీం కోర్టు తీర్పు ద్వారా మాదిగ లకు అనుకూల తీర్పు ఇప్పించారు అన్నారు. రాష్టంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి వర్గీకరణ పై ఆర్డి నేన్సు తీసుకోని వర్గీకరణ అమలు చేస్తాననడం బావ్యం కాదు అన్నారు .మాదిగలు బీజేపీ కి మద్దతు ఇస్తే మాలలు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి ప్రభుత్వం ఏర్పాటుకు సహకారం చేశా రాన్నారు రేవంత్ రెడ్డి తన నిర్ణయం మార్చుకోవాలి అన్నారు. అన్ని మాల సంఘాలు కలిసి రావాలి అన్నారు కరీంనగర్ అంబేద్కర్ చౌరస్తా లో ఆగస్టు 21 నాడు బంద్ చేస్తామన్నారు .కరీంనగర్ మాలలు అంబేద్కర్ వదులు హాజరు అయి విజవంతం చేయాలి అని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దోసాల చంద్రం ముల్కల జయరాజు మేకల సత్యం బడత్ రవి మధు బొగ్గుల రతన్ రాజు బొగ్గుల రాజీవ్ రతన్ పాల్గొన్నారు.



# జనగాం జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలి.....

### - పాపన్న స్పూర్తితో బహుజనులు రాజ్యాధికారం కోసం కృషి చేయాలి: లింగంగౌడ్

**తెలంగాణ వీణ/ఉప్పల్:** బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు పాపన్న అని అతను మొగలాయి దౌర్జన్యాలను ఎదురించి,తెలంగాణ ప్రాంతంలో బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన అడుగు జాడల్లో ఇపుడున్న ఎస్సీ,ఎస్టీ,బీసీ యువత నడిచి రాజ్యాధికారం కోసం కృషి చేయాలని అన్నారు. జనగాం జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని అన్నారు. బహుజనులకు రాజ్యాధికారం సిద్ధించడానికి మరేంతో కాలం లేదని ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైందని రాబోవు కాలం బహుజనులదే రాజ్యాధికారమని అయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ తిరుపతయ్య గౌడ్ పాల్గొన్నారు.



9 TV తెలుగు
తెలంగాణ వీణ
For Advertisements
8328209811
Flat No 204,
Mythri Appartments,
Opp BSNL Office, ECIL

# అంతర్జాతీయ క్రికెట్‌లో 16 ఏళ్లు పూర్తి చేసుకున్న విరాట్ కోహ్లీ..



విరాట్ కోహ్లీ పరిచయం అక్కర్లేని పేరు. విరాట్ ఇంటర్ నేషనల్ క్రికెట్ లోకి అడుగు పెట్టి నేటికి 16 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ 16 ఏళ్ల కాలంలో అతను ఎన్నో ఘనతలు సాధించాడు. విరాట్ కోహ్లీ వన్డేల్లో తన 19వ ఏట ఆగస్టు 18, 2008న శ్రీలంకపై అరంగేట్రం చేశాడు. అతని అరంగేట్రం ప్రదర్శన సాధారణంగానే ఉంది. ఈ మ్యాచ్ లో అతను కేవలం 12 పరుగులు మాత్రమే చేశాడు. అయితే ఇది అద్భుతమైన ప్రయాణానికి నాంది పలికింది.వన్డేల్లో కోహ్లీ తన నిలకడతో త్వరగానే జట్టులోని కీలక ఆటగాళ్లలో ఒకరిగా నిలిచాడు. తన తొలి వన్డే సెంచరీని 2009లో శ్రీలంకపై సాధించాడు. అలాగే అత్యంత వేగంగా 8,000, 9,000, 10,000, 11,000, 12,000 పరుగులు చేశాడు. %ాణ×%లలో అత్యంత వేగంగా ఈ మైలురాళ్లను చేరుకున్న రికార్డును కోహ్లీ పేరిట ఉంది. విరాట్ కోహ్లీ 2011 లో వెస్టిండీస్‌పై తన టెస్టు అరంగేట్రం చేశాడు. త్వరలోనే జట్టులో ప్రధాన సభ్యుల్లో ఒకడిగా నిలిచాడు.2012లో అడిలైడ్‌లో ఆస్ట్రేలియాపై కోహ్లి తన తొలి టెస్టు సెంచరీని సాధించాడు. కోహ్లీ టెస్ట్ కెరీర్ లో ఏడు డబుల్ సెంచరీలు ఉన్నాయి. టెస్టుల్లో అత్యధిక డబుల్ సెంచరీలు బాదిన భారత ఆటగాడిగా కోహ్లీ రికార్డును సొంతం చేసుకున్నాడు. విరాట్ కోహ్లీ 2010లో టీ20 జింబాబ్వే పై అరంగేట్రం చేశాడు. ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (%=జదీ%) కెప్టెన్‌గా, టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన వారిలో కోహ్లీ ఒకడిగా నిలిచాడు. 2016 సీజన్‌లో 973 పరుగులు చేశాడు.విరాట్ కోహ్లీ కెప్టెన్ గా భారత జట్టుకు సేవలు అందించాడు. టెస్ట్ కెప్టెన్సీ 2014 నుంచి 2022 వరకు నిర్వహించాడు. 2014లో టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించిన కోహ్లి 2018–19 సీజన్‌లో ఆస్ట్రేలియాలో వారి మొట్టమొదటి సిరీస్ విజయంతో సహా అనేక చారిత్రాత్మక సిరీస్ విజయాలను అందించాడు. 2017 నుంచి 2021 వరకు వన్డే, టీ20 లకు విరాట్ కోహ్లీ కెప్టెన్ గా వ్యవహరించాడు. 2017లో %×జజ% ఛాంపియన్స్ ట్రోఫీలో ఫైనల్స్‌కు తీసుకెళ్లాడు. 2019 ప్రపంచ కప్‌లో ఇండియా సెమీ–ఫైనల్‌కు చేరుకుంది.కోహ్లీ కెరీర్ అనేక %×జజ% అవార్డులు ఉన్నాయి. 2017, 2018లో %×జజ% క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా ప్రతిష్టాత్మకమైన సర్ గార్ఫీల్డ్ సోబర్స్ ట్రోఫీని గెలుచుకున్నాడు. కోహ్లీ ఇతర క్రికెటర్ల కంటే వేగంగా 70 అంతర్జాతీయ సెంచరీల మైలురాయిని చేరుకున్నాడు.

# సెంట్రల్ ఢిల్లీ కింగ్స్‌పై తూర్పు ఢిల్లీ రైడర్స్ 10 వికెట్ల తేడాతో విజయం

అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఢిల్లీ ప్రీమియర్ లీగ్ టి20లో వర్షం అంతరాయం కలిగించింది. దీంతో మ్యాచ్ ని 10 ఓవర్లకు కుదించారు. ఈ మ్యాచ్‌లో ఈస్ట్ ఢిల్లీ రైడర్స్ సెంట్రల్ ఢిల్లీ కింగ్స్‌పై 10 వికెట్ల తేడాతో అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది.ఈ విజయంలో సమిష్టి బౌలింగ్ మరియు బ్యాటర్లు రాణించారు.హిమాన్షు చౌహాన్ 15 పరుగులిచ్చి 3 వికెట్లు తీసుకున్నాడు. సిమర్జిత్ సింగ్ 8 పరుగులకే 2 వికెట్లు తీయడంతో ఈస్ట్ ఢిల్లీ రైడర్స్ సెంట్రల్ ఢిల్లీ కింగ్స్‌ను 8.1 ఓవర్లలో 61 పరుగులకే ఆలౌట్ చేసింది. దీంతో ఈస్ట్ ఢిల్లీ కేవలం 4.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని సులువుగా సాధించింది. ఓపెనర్లు హిమ్మత్ సింగ్ మరియు అనుజ్ రావత్ వరుసగా 31 మరియు 25 పరుగులతో అజేయ ఇన్నింగ్స్‌లు ఆడారు, కేవలం 25 బంతుల్లో మ్యాచ్‌ను ముగించారు. 3 ఓవర్ల పవర్‌ప్లేలో 49 పరుగులు చేసి 35 బంతులు మిగిలి ఉండగానే 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది.వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభించిన సెంట్రల్ ఢిల్లీ కింగ్స్‌కు తమ ఇన్నింగ్స్‌లో ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. తొలి ఓవర్‌లో దీపేష్ బలియన్ అవుట్ కాగా, మూడో ఓవర్‌లో కెప్టెన్ యశ్ ధుల్ (13) అవుటయ్యాడు, దీంతో 3 ఓవర్ల పవర్‌ప్లే ముగిసే సమయానికి సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ స్కోరు 28/2 వద్ద ఉంది. ఓపెనింగ్ ఓవర్‌లో ధుల్‌ని అవుట్ చేసిన హిమాన్షు చౌహాన్, ఐదో ఓవర్‌లో హితేన్ దలాల్ (16), లక్ష్య థరేజా (1) వికెట్లను తీయడం ద్వారా 3/15తో తన స్పెల్‌ను పూర్తి చేశాడు. ఆ తర్వాతి ఓవర్‌లో రౌనక్ వాఘేలా రెండు పరుగులు చేసి జాంటీ సిద్ధూ (15),



సుమిత్ కుమార్ (5)లను అవుట్ చేశాడు. సిద్ధూ మంచి స్థితిలో కనిపించాడు కానీ తన ఆరంభాన్ని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయ్యాడు.ఈస్ట్ ఢిల్లీ రైడర్స్ బౌలర్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించి సెంట్రల్ ఢిల్లీ కింగ్స్‌ను 8.1 ఓవర్లలో కేవలం 61 పరుగులకే ఆలౌట్ చేశారు. కేశవ్ దబాస్ (2) ప్రారంభంలోనే రనౌట్ అయ్యాడు, ఆ తర్వాత సిమ్రంజీత్ సింగ్ తన చివరి ఓవర్‌లో కౌశల్ సుమన్ మరియు యోగేష్ శర్మలను అవుట్ చేశాడు. దీని తర్వాత, తొమ్మిదో ఓవర్‌లో ఎల్‌బివింగ్ ప్రిన్స్ చౌదరి ద్వారా హర్ష్ త్యాగి ఇన్నింగ్స్‌ను ముగించాడు.

# టీ20 ప్రపంచ కప్ షెడ్యూల్ విడుదల



2025 మహిళల అండర్–19 టీ20 ప్రపంచ కప్ షెడ్యూల్‌ని ఐసీసీ విడుదల చేసింది. జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరగనున్న టోర్నీకి మలేసియా ఆతిథ్యం ఇవ్వనుంది.ఈ టోర్నీలో మొత్తం 41 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. 16 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతి గ్రూప్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిక్స్ దశకు చేరుకుంటాయి. సూపర్ సిక్స్‌లోని రెండు గ్రూప్‌ల్లో టాప్–2లో నిలిచిన జట్లు సెమీస్‌కు చేరతాయి.గ్రూప్ ఎ : భారత్, వెస్టిండీస్, శ్రీలంక, మలేసియా.గ్రూప్ బి : ఇంగ్లాండ్, పాకిస్థాన్, ఐర్లాండ్, యూఎస్ఏగ్రూప్ సి : న్యూజిలాండ్, సౌతాఫ్రికా, ఆఫ్రికా క్వాలిఫయర్, సమోవాగ్రూప్ డి : ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఆసియా క్వాలిఫయర్, స్కాట్లాండ్ ఉన్నాయి.

# టెస్టు క్రికెట్.. భారత్, ఆస్ట్రేలియాను అధిగమించి దక్షిణాఫ్రికా ప్రపంచ రికార్డు



**ఇంటర్నెట్ డెస్క్:** టెస్టు క్రికెట్‌లో వెస్టిండీస్‌పై దక్షిణాఫ్రికా ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. తాజాగా విండీస్‌తో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 40 పరుగుల తేడాతో విజయం సాధించింది.దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను 1–0తో కైవసం చేసుకుంది. తొలి టెస్టు డ్రాగా ముగిసింది. ఈ సిరీస్ నెగ్గడం ద్వారా దక్షిణాఫ్రికా ప్రపంచ రికార్డు సృష్టించింది. టెస్టుల్లో ఒక జట్టుపై వరుసగా వరుసగా అత్యధిక (10) సిరీస్‌లు నెగ్గిన టీమ్‌గా అవతరించింది. అంతకుముందు ఈ రికార్డు టీమ్‌ఇండియా (9), ఆస్ట్రేలియా (9) పేరిట సంయుక్తంగా ఉండేది. ఆసక్తికర విషయం ఏంటంటే.. భారత్, ఆస్ట్రేలియా కూడా వెస్టిండీస్‌పైనే ఈ రికార్డును నెలకొల్పాయి. వెస్టిండీస్, దక్షిణాఫ్రికా మధ్య ఇప్పటివరకు 33 టెస్టులు జరిగాయి. ఇందులో దక్షిణాఫ్రికా మూడు మ్యాచ్‌ల్లో మాత్రమే ఓడింది. ఇరుజట్ల మధ్య 1992లో జరిగిన తొలి టెస్టు సిరీస్ (ఒక మ్యాచ్)లో సౌతాఫ్రికా పరాజయం చవిచూసింది. కానీ, తర్వాత జరిగిన 10 సిరీస్‌లను కైవసం చేసుకుని విండీస్‌పై తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. **చరిత్ర సృష్టించిన కేశవ్ మహరాజ్...** కరేబియన్ జట్టుతో తాజాగా జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహరాజ్ ఐదు వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలోనే ఆ దేశం తరఫున టెస్టుల్లో ఎక్కువ వికెట్లు తీసిన స్పిన్నర్‌గా రికార్డు సృష్టించాడు. 1949–1960 మధ్యకాలంలో ఆడిన హ్యూ టేఫీల్డ్ (170) వికెట్ల రికార్డును కేశవ్ బ్రేక్ చేశాడు. విండీస్‌తో టెస్టు సిరీస్‌లో కేశవ్ మహరాజ్ 13 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు.


# కోల్‌కతా రేప్ ఘటనపై సూర్యకుమార్ ఇన్‌స్టాలో పోస్ట్..



కోల్‌కతాలో జరిగిన సామూహిక అత్యాచారం–హత్య ఘటన అందరినీ కలచివేసింది. ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్‌తో పాటు యావత్ దేశమంతా ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. దేశ వ్యాప్తంగా ఇలాంటి అనేక సంఘటనలు అందరి దృష్టిని ఆకర్షించాయి.ఇలాంటి ఘటనలతో బాధపడుతున్న కుటుంబ సభ్యులకు భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఒక మెస్సెజ్ ఇచ్చాడు. ఆయన ఇన్‌స్టాలో ఓ స్టోరీని పంచుకున్నాడు. ‘కూతుర్ని కాపాడుకోవడం కంటే.. కొడుకు, తమ్ముడు, భర్త, తండ్రి, స్నేహితులకు చదువు చెప్పించడం మేలు’ అని తెలిపాడు.సూర్యకుమార్ యాదవ్ తన ఇన్‌స్టా స్టోరీలో ఆదివారం (ఆగస్ట్ 18) ఒక ఫొటోను పోస్ట్ చేసాడు. అందులో “మీ కూతుర్ని రక్షించండి” అని రాశాడు. అయితే.. అతను ఈ లైన్‌ను కట్ చేసి, మీ కొడుకును ఎడ్యుకేట్ చేయండి. మీ సోదరులకు చదువు చెప్పండి, మీ తండ్రికి, భర్తలకు మరియు స్నేహితులకు చదువు చెప్పండి. మీరు మీ కొడుకు, సోదరులకు చదువు చెప్పించకపోతే, ఇలాంటివే జరుగుతాయని చెప్పాడు. కూతుళ్లను రక్షించాల్సిన అవసరం లేదు.. కానీ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూర్య స్పష్టంగా చెప్పాడు.సూర్యకుమార్ గురించి మాట్లాడితే.. అతను ప్రస్తుతం బుచ్చిబాబు టోర్నమెంట్‌లో ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడు. మూడు ఫార్మాట్లలో భారత్‌కు ఆడాలనుకుంటున్నట్లు తన ఉద్దేశాన్ని స్పష్టం చేశాడు. కానీ.. వన్డే ఇంటర్నేషనల్, టెస్ట్‌లో అతని రికార్డు అంత బాగా లేదు. ఈ క్రమంలో అతన్ని ఆ ఫార్మాట్ల నుంచి తప్పించారు. ప్రస్తుతం టీ20 జట్టుకు కెప్టెన్సీ బాధ్యతలు వహిస్తున్నాడు. కాగా.. వన్డే, టెస్ట్ జట్టులో పునరాగమనం కోసం ఎదురు చూస్తున్నాడు.

# ఓడిపోతామనే భయంతో.. స్టేడియాన్నే మార్చేసిన పాక్..

పాకిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఏ టెస్టు సిరీస్‌కైనా ముందు అంతా సవ్యంగా జరగడం ముఖ్యం. అయితే, పాక్ ఆటగాళ్ల మధ్య గొడవలు జరిగే అవకాశం ఉందనే చర్చలు ఓవైపు, అలాగే పాక్ క్రికెట్ బోర్డు నిర్ణయాలపైనే పలు వివాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. పాక్ క్రికెట్ బోర్డు ఇలా ఒకదాని తర్వాత ఒకటిగా నిర్ణయాలు తీసుకోవడం ఇబ్బందిగా మారింది. ఆ తర్వాత వాటిని తప్పించుకునేందుకు విచిత్రమైన కారణాలు చెబుతుండడంతో అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. 12 రోజుల క్రితం పీసీబీ వేదికగా మార్చిన రెండో టెస్టు మ్యాచ్‌కు సంబంధించి మరోసారి చర్చకు కారణం.




GS9TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్నీ జిల్లాల నుండె విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024







# ఈ రేంజిలో దుమ్ము దులిపేస్తున్నావేంది 'దేవర'

యంగ్ టైగర్ ఎన్టీఆర్ సోలో హీరోగా కనిపించి చాలా రోజులే అయింది. ఆయన అభిమానులు 'దేవర' సినిమా కోసం ఎంతగానో ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ సినిమాకు సంబంధించి పోస్టర్స్ దగ్గర నుండి ట్రైలర్లు, సాంగ్స్ ఇన్స్టంట్ హిట్ గా నిలుస్తున్నాయి. ఇప్పటికే టీజర్ కు ఊహించని స్పందన రాగా.. ఫియర్ సాంగ్ బ్లాక్ బస్టర్ హిట్ అయింది. అయితే వీటన్నింటినీ మించి 'చుట్టమల్లె' సాంగ్ చార్ట్ బస్టర్ అయింది. ఇటీవల విడుదలైన చుట్టమల్లె లిరికల్ సాంగ్ చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. అనిరుధ్ రవిచందర్ అందించిన సోల్ ఫుల్ కంపోషన్‌తో ఈ పాట అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ పాట యూట్యూబ్‌లో విడుదలైనప్పటి నుండి ట్రెండింగ్‌లో ఉంది. చుట్టమల్లె యూట్యూబ్‌లో 100 మిలియన్ వ్యూస్‌ను కూడా సాధించింది. తెలుగు వెర్షన్‌లో చుట్టమల్లె ఇప్పటికీ 73 మిలియన్ వ్యూస్‌తో నంబర్ 1 స్థానంలో కొనసాగుతోంది. హిందీ వెర్షన్ కూడా 22 మిలియన్ల వ్యూస్ ను పొందింది. తమిళ వెర్షన్ 5 మిలియన్ల వ్యూస్ సాధించగా.. కన్నడ, మలయాళ వెర్షన్లు 2 మిలియన్ వ్యూస్‌ని సాధించాయి. ఈ పాటకు ఇప్పటి వరకు 104 మిలియన్ వ్యూస్ వచ్చాయి. దేవర సినిమా మొదటి లిరికల్ ఫియర్ సాంగ్ విడుదలైన తర్వాత పెద్ద సంచలనంగా మారింది. ఇక ఇప్పుడు చుట్టమల్లెతో సినిమాకు హైప్ మరింత పెరిగింది. మూడో లిరికల్ సాంగ్ కోసం అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దేవర సెప్టెంబర్ 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. షూటింగ్ చివరి దశకు చేరుకుంది.

# వారిపై చర్యలు తీసుకోవాలి.. హీరో మనోజ్ ట్వీట్



కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన దారుణం గురించి ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆగ్రహం వెల్లువెత్తుతోంది. ఆమెకు న్యాయం జరగాలని ప్రతి ఒక్కరూ డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు కొందరు ఆకతాయిలు.. సదరు బాధితురాలిని ఉద్దేశించి చెప్పుకోలేని విధంగా అసభ్యకర రీతిలో పోస్టులు పెడుతున్నారు. ఇప్పుడు వీటిపై టాలీవుడ్ హీరో మంచు మనోజ్ ట్వీట్ చేశాడు. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. **పోరబడ్డారు.. తను నా భార్య కాదు: హరీశ్ శంకర్)**'జన్మనిచ్చిన మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమవ్వడం నా హృదయాన్ని ముక్కలు చేసింది. స్క్రీన్ వెనకాల ఉండి దారుణమైన పోస్టులు చేస్తున్న వారిని గుర్తించి శిక్షించడంలో విఫలమయ్యాం. కోల్‌కతా ఘటనలో బాధితురాలిని ఉద్దేశించి అసభ్యకర పోస్టులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. ఇలాంటి సంస్కృతిని నార్మలైజ్ చేయకుండా జవాబుదారీగా నిలబడాలని కోరుతున్నా' అని మనోజ్ తన ట్వీట్‌లో రాసుకొచ్చారు.ఏం జరిగిందంటే? కోల్‌కతాలోని ఆర్ జీ కర్ ఆస్పత్రిలో రాత్రి పూట విధుల్లో ఉన్న 31 ఏళ్లట్రైనీ డాక్టర్‌పై దారుణంగా అత్యాచారం చేసి, ఆపై హతమార్చారు. ఈ ఘటన తెల్లవారుజామున జరిగింది. తొలుత ఈ ఘటనని ఆత్మహత్య అనుకున్నారు. కానీ యువతి శరీరంపై దాడి చేసిన గుర్తులు ఉండగా పోస్టు మార్టం చేయగా రిపోర్టులో ఆమెపై సాముహిక అత్యాచారం జరిగిందని విషయం బయటపడింది.

# మోహన్ లాల్‌కి అస్వస్థత, ఆస్పత్రికి తరలింపు



ప్రముఖ మళయాళం స్టార్ హీరో మోహన్ లాల్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను కుటుంబసభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. మోహన్ లాల్‌ని పరీక్షించిన వైద్యులు.. ఆయన తీవ్ర జ్వరం, కండరాల నొప్పులతో పాటు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కుంటున్నట్టు గుర్తించారు. అధికారిక మెడికల్ రిపోర్ట్ ప్రకారం.. మోహన్ లాల్ వైరల్ రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్ బారిన పడినట్టు డాక్టర్లు అనుమానిస్తున్నారు.వైరల్ రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్ సోకిన వారికి శ్వాస తీసుకోవడంలో తీవ్రమైన సమస్యలు ఎదురవుతాయి. ఇప్పుడు మోహన్ లాల్ కూడా అలాంటి సమస్యతోనే బాధపడుతున్నారు. ఆయన మరో 5 రోజుల పాటు ఎక్కడికి వెళ్లకుండా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఇటీవలే గుజరాత్‌లో ' %వా%2:ఇంపురాన్ ' అనే సినిమా షూటింగ్ ముగించుకుని కొచ్చికి వచ్చిన తరువాతే మోహన్ లాల్ అనారోగ్యం బారినపడినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మోహన్ లాల్ తొలిసారిగా డైరెక్షన్ విభాగంలో తన అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. బారోజ్ అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా పూర్తి చేసుకుంది. అక్టోబర్ 2న ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా రిలీజ్ కానుంది. భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ కలిగిన స్టార్ హీరో తొలిసారిగా డైరెక్ట్ చేస్తోన్న సినిమా కావడంతో బారోజ్ మూవీపై మోహన్ లాల్ అభిమానుల్లో భారీ అంచనాలే నెలకొని ఉన్నాయి. వాస్తవానికి బారోజ్ సినిమా ఈ ఏడాది మార్చి 28నే విడుదల కావాల్సి ఉండగా.. పోస్ట్ ప్రొడక్షన్‌లో తలెత్తిన ఇబ్బందుల కారణంగా ఆలస్యం అవుతూ వచ్చింది.



# వెండితెరపై మరోసారి సందడి చేయనున్న శివాజీ-లయ జోడీ..!

శివాజీ, లయ జోడీ మరోసారి వెండితెరపై కనువిందు చేయనున్నది. ఇద్దరి కాంబినేషనల్‌లో టాటా బిర్లా మధ్యలో లైలా, అదిరిందయ్యా చంద్రం, మిస్సమ్మ చిత్రాలు రాగా..ప్రేక్షకులను ఆకట్టున్నాయి. దాదాపు 15 సంవత్సరాల తర్వాత మరోసారి జంటగా ప్రేక్షకుల ముందుకు రానున్నారు. శివాజీ, లయ హీరో హీరోయిన్లుగా ఓ కామెడి క్రైమ్ థ్రిల్లర్ తెరకెక్కనున్నది. ఈ మూవీకి సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన ఈ మూవీతోనే దర్శకుడిగా ఎంట్రీ ఇవ్వబోతున్నారు. మరో విశేషం ఏంటంటే శివాజీ ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.తన సొంత శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ పతాకంపై చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరగ్గా.. ప్రముఖ నిర్మాత దిల్ రాజు క్లాప్ కొట్టారు. శివాజీ తనయుడు రిక్కీ కెమెరా స్విచ్చాన్ చేయగా.. స్టార్ డైరెక్టర్ బోయపాటి శ్రీనివాస్ ముహూర్తం షాట్‌కు దర్శకత్వం వహించారు. ఈ నెల 20 నుంచి చిత్రం రెగ్యులర్ షూటింగ్ జరుగనున్నది. ఇంకా సినిమా టైటిల్ ఖరారు కాలేదు. త్వరలోనే మిగతా ఆర్టిస్టుల వివరాలను ప్రకటించనున్నారు. లయ చివరిసారిగా టాటాబిర్లా మధ్యలోలైలా చిత్రంలో కనిపించింది. చివరిసారిగా అమర్ అక్బర్ ఆంథోనీ మూవీలో అతిథి పాత్రలో మెరిసింది. ప్రస్తుతం మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తున్నది. ఈ మూవీతో నితిన్ తమ్ముడు మూవీలో సైతం నటిస్తున్నది.















Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written